క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పూర్ణామార్కెట్ వద్ద శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: పరిసరాల శుభ్రతతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ అన్నారు. 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను రోడ్డుపై వేయవద్దని, దుకాణాల వద్ద పెడుతున్న డస్ట్‌బిన్‌లలో వేయాలని సూచించారు. ప్రతీ దుకాణం వద్ద తడి, పొడి, ప్రమాదకర చెత్త వేసేందుకు మూడు డబ్బాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలా ఏర్పాటు చేయని దుకాణాల నుంచి అపరాధ రుసుము విధించి, దగ్గరుండి చెత్త డబ్బాలను పెట్టించాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడా చెత్త పేరుకోకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. వార్డు ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

నారాయణరావుకు స్వర నివాళి



నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, కళాకారులు

తాటిచెట్లపాలెం: వైశాఖి మ్యూజికల్ ఎంటర్‌టైనర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, గాయకుడు, లెక్చరర్ వీరగంట నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో స్వర నీరాజనం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విశాఖ కళా సంఘాల గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఏసీటీవో నాగేశ్వరావులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు కళాకారులు, గాయకులు సినీ గీతాలు పాడి అలరించారు. పలువురు వక్తలు నారాయణరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళారంగ ప్రతినిధులు సిహెచ్.సత్యనారాయణ, చెన్నా తిరుమలరావు, ఫణిస్వామి, ఎంవీ రాజశేఖర్, సన్ మూర్తి, వెంకటేష్ మాస్టర్, ఉషా చీరాల, వి.సుశీల, వంశీకృష్ణ, శరత్ చంద్ర, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

పక్షులకోసం నీటి కుండలు



చెట్టుకు నీటి కుండలు కడుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఎండలు మండుతున్న నేపథ్యంలో పక్షులు సేద తీరేందుకు చెట్లపై నీటి కుండల్ని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. సోమవారం గోపాలపట్నం రైతు బజారులో చెట్లకు మట్టి కుండల్లో నీరు నింపి కట్టారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'స్పందన'కు 15 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎగిరిన కార్మిక జెండా

- 'దక్షిణ'లో ఘనంగా మే డే వేడుకలు
- హక్కుల రక్షణ, డిమాండ్ల సాధనకు కార్మికులంతా ఏకం కండి
- యూనియన్ల నాయకుల పిలుపు



ఎర్రజెండాను ఎగరేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు



ఆశీలమెట్ట జంక్షన్ నుంచి ప్రదర్శనగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు

దాబాగార్డెన్స్: ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని సోమవారం నియోజకవర్గంలో కార్మికులందరూ ఎర్ర జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్ సమీపాన గల కార్యాలయంలో సిటూ సీనియర్ నాయకుడు వై.రాజు జెండా ఎగరేశారు. సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం రూ.26 వేలు అమలుకు భవిష్యత్‌లో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బి.జగన్, అప్పలరాజు, సూరీడు, పోలేశ్వరరావు, నరసింగరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భవితవ్యం అగమ్యగోచరం

బీజేపీ ప్రభుత్వ పాలనలో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు సమీపాన యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, యూనియన్ నాయకులు సత్తిరాజు, పీఏ బాబు, రమణబాబు, పోతన్న, నరసింగరావు, కోటి, ప్రసాద్, మోహన్, సురేష్, సత్యానంద్, ప్రకాశరావు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

- విశాలాంధ్ర బుక్‌హౌస్ వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు జెండా ఆవిష్కరించారు. దేశంలోని పేదల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. బుక్‌హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు, మూర్తి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకుందాం

సీతమ్మధార: మే డే అమరవీరుల స్ఫూర్తితో దేశ కార్మిక చట్టాలు, హక్కులను కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశీలమెట్ట జంక్షన్‌లో కార్మిక ప్రదర్శన నిర్వహించారు. లలితా జ్యూయలరీ నుంచి గురజాడ జంక్షన్ మీదుగా తిరిగి ఆశీలమెట్ట జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఆశా కార్యకర్తలు కోలాటం, నృత్యాలు ప్రదర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, స్టీల్‌ప్లాంట్ రక్షణకు పోరాడుదామని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కార్మికులకు ద్రోహం చేసే ఏ ప్రభుత్వాన్నైనా గద్దె దించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. ప్రధాని మోదీకి, ఆయన అనుకూల పార్టీలకు 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆశా యూనియన్ అధ్యక్షురాలు పద్మ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.నూకరాజు, బి.జగన్, ఎం.సుబ్బారావు, యుఎస్ఎన్ రాజు, చంద్రశేఖర్, చంద్రమౌళి, సంతోష్, కె.కుమారి, ఎంసీహెచ్ అప్పుడు, ఎ.సీతాలక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో..

అల్లిపురం: అల్లిపురం సీపీఐ కార్యాలయంలో మే డే పతాకాన్ని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆదాయాన్ని పెంచడంలో వైఫల్యం చెందిదని, కార్మిక చట్టాలను కాలరాస్తూ పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరువల్లి పైడిరాజు, కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్, నాయకులు జి.కాసులరెడ్డి, రాజు, ఫణీంద్ర, శ్రీనివాస్, అప్పన్న, నాగరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో.. సింహాలదేవిడి వద్ద ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొటాన సత్తిబాబు మే డే పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ వ్యయం పెరగడంతో ఉపాధి లేక కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

- నీలమ్మ వేపచెట్టు దరి రిక్షా స్టాండ్ వద్ద కార్మిక నాయకులు చెల్లూరి నూకాలమ్మ, సిమ్మయ్య, పైడిరాజు, అప్పారావు, శ్రీను మే డే పతాకాన్ని ఆవిష్కరించారు.

జిల్లా కోర్టులో..

విశాఖ లీగల్: విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలోని భవనంలో మే డే వేడుకలను సంస్థ నూతన కార్యదర్శి ఎం.వి.వి.శేషమ్మ ప్రారంభించి మాట్లాడారు. అసంఘటిత, కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం, సంరక్షణ వంటి అంశాలపై తగిన చర్యలు, భద్రతాపరమైన అంశాలను వివరించారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ప్రభుత్వపరంగా కార్మికులకు అందిస్తున్న సేవలను తెలియజేశారు. కార్మిక శాఖ జోన్ వన్ కమిషనర్ ఎం.రామారావు, పలు రంగాలకు చెందిన కార్మికులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

మహారాణిపేట: శ్రామికుల జీవితాల్లో పెనుమార్పులకు శ్రీకారం చుట్టిన రోజే మే డే అని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అభివర్ణించారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.డి.నాయుడు ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బందిని ఉద్దేశించి డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ తమ హక్కులను కాపాడుకోవడం కోసం అంతా ఏకం కావాలన్నారు. కేజీహెచ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి మే డే జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడటంలో ఏఐటీయూసీ అనుబంధ సంస్థలు కట్టుబడి ఉన్నాయన్నారు. కేజీహెచ్ సహాయ సంచాలకులు చిట్టూరి శ్రీనివాస్, కృష్ణా కన్‌స్ట్రక్షన్ ఇన్‌చార్జి మద్దాల రామ సుబ్బారావు, ఏఆర్ఎంవోపీ అరుణాదేవి, నాయకులు శంకరరావు, పైడిరాజు, రాజేశ్వరి, అప్పలరాజు, మంగమ్మ, రాము, వినోద్ కుమార్, గణేష్, కుమారి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి



జిల్లా కోర్టులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి ఎం.వి.వి.శేషమ్మ



పూర్ణామార్కెట్ దరి అల్లూరి విగ్రహం వద్ద జెండా ఎగరేస్తున్న ముఠా కార్మికులు, కలాసీలు

పతాకావిష్కరణలో 3 వేల మంది కార్మికులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పూర్ణామార్కెట్ పరిధిలోని 3 వేల మంది ముఠా కార్మికులు, కలాసీలంతా కలిసి జెండా ఎగురవేశారు. ఆయా సంఘాల నాయకులు బుజ్జి, మల్లిబాబు మాట్లాడుతూ కార్మికులందరు కలసి మే డే జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్ బాధ్యతల స్వీకరణ



జగదాంబ : హార్బర్ ఏసీపీగా మోసెస్‌పాల్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు సీసీఎం విభాగంలో మోసెస్‌పాల్ పని చేశారు. బదిలీపై హార్బర్ ఏసీపీగా వచ్చిన ఆయన సోమవారం షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మల్కాపురం సీఐ లూథర్‌బాబు ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడి ఏసీపీ శిరీషా గుంటూరుకు బదిలీ అయ్యారు.

'స్పందన'కు రెండే వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులే అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ, సీడీవో పద్మావతి పాల్గొన్నారు.

14న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఈ నెల 14న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ తెలిపారు. సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల సమీపాన గల పునీత అంథోనీ దేవాలయం ఆవరణ బిషప్ హౌస్‌లో కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986 నుంచి ఈ పండగ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ నెల 5 నుంచి 13 వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు దివ్యబలిపూజ జరుగుతుందని చెప్పారు. పూజా కార్యక్రమాలను ఉత్తరాంధ్ర జిల్లాలోని చర్చ్ ఫాదర్లు నిర్వహిస్తారని తెలిపారు. పునీత పేతురు ప్రధాన దేవాలయం విచారణ కర్తలు, రక్షణగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, 12న గుంటూరు బిషప్ చిన్నబత్తిన భాగయ్య, 13న విశాఖ అగ్రపీఠాధిపతి మల్లవరపు ప్రకాష్, 14న కార్డినల్ హైదరాబాద్ అగ్రపీఠాధిపతి ఆంథోనీ పూల ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించనున్నారని చెప్పారు. మహోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విశ్వాసులు పాల్గొంటున్నారని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు బూర శేషుబాబు, ఆదిరెడ్డి చార్లీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు

- వాడవాడలా సేవాకార్యక్రమాలు



ఉచిత స్వర్గ రథం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



పేదలకు సరకులు అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను దక్షిణ నియోజకవర్గ పరిధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంకోసా గెస్ట్ హౌస్‌లో వైవీ సుబ్బారెడ్డి జన్మదినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. అనంతరం మన్యాల శ్రీనివాస్ పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత స్వర్గ రథం(అంతిమయాత్ర వ్యాన్)ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా పలు సేవాకార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విశాఖ జిల్లా బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- విశాఖ జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేరువ గణేష్, జెర్రిపోతుల ప్రసాద్ తదితరులు పాల్గొని, సరకులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కామన వెంకట సుబ్బారావు, సంఘం రాష్ట్ర అసోసియేట్ ఉపాధ్యక్షుడు దీవి సుందరరావు, బుడ్డి గణపతి, ఎస్. వెంకట్రావు, మార్గాన చినబాబు, నారాయణ రావు, స్వామి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగదాంబ: టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి పుట్టినరోజు సందర్భంగా జీవీఎంసీ 35వ వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చలివేంద్రం ప్రారంభించారు. వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కేక్‌కట్ చేశారు. అనంతరం చలివేంద్రంలో మజ్జిగ, కర్బూజా పంపిణీ చేశారు. వార్డు నాయకులు బత్తుల రాము, మూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

మహారాణిపేట: వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ పాల్గొని, కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యకర్తలకు, పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

జోరువానలో యువ కార్మికుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం జోరువానలోనూ నిరసన తెలిపారు. మే డే సందర్భంగా ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినదించారు. వేతన ఒప్పందం అమలు చేయాలని, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. గుర్తింపు సంఘం వెంటనే వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జోన్-5లో 96.2 శాతం పింఛన్ల పంపిణీ



జోన్-5లో పింఛన్ అందిస్తున్న వలంటీర్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో సోమవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోరు వానలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. జోన్ పరిధిలో మొత్తం 26,154 మందికి సుమారు రూ.7.4 కోట్లు పెన్షన్ నగదు అందించారు. సుమారు 96.2 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ తెలిపారు. ఆయా వార్డుల్లో వలంటీర్లు, సచివాయల వెల్ఫేర్ కార్యదర్శులు ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. మంగళవారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు జెడ్సీ కృష్ణ ఆదేశించారు.

35వ వార్డులో 95శాతం ..



కల్లుపాకల్లో పింఛన్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పరిధిలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జోరుగా సాగింది. ఒక్క రోజులోనే 95శాతం పింఛన్లను పంపిణీ చేశారు. వలంటీర్లు, కార్యదర్శులతో కలసి, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ సొమ్మును పెంచడంతో పాటు ప్రతీ నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎప్పుడూ పెద్దపీట వేస్తూనే ఉన్నారన్నారు. వార్డు నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆదర్శం జేసీఐ



మాట్లాడుతున్న జేసీఐ నూతన అధ్యక్షురాలు రోహితా ఆర్జీ

తాటిచెట్లపాలెం: సేవా కార్యక్రమాల నిర్వహణలో జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్(జేసీఐ) సంస్థ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని సంస్థ నూతన అధ్యక్షురాలు రోహితా ఆర్జీ తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త కార్యవర్గం ఏడాది పాటు కొనసాగుతుందని చెప్పారు. సేవా కార్యక్రమాలపై ఆసక్తి గల యువత జేసీఐలో చేరడానికి ముందుకొస్తున్నారన్నారు. సంస్థ జోన్ కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ జేసీఐ ఆధ్వర్యంలో ఏటా పలు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పలు అంశాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ ఉపాధ్యక్షుడు జీఎస్ఎన్ వర్మ, ప్రత్యేక అతిథి రాజేష్‌కుమార్, కార్యదర్శి సింధుజా, కోశాధికారి శివ, కృష్ణకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అతిథులు, యూనియన్ నాయకులు


అల్లిపురం: రక్తదానం ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానమని ఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ అన్నారు. మే డేను పురస్కరించుకుని విద్యుత్ సౌధలోని ఆడిటోరియంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ 1104, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్, ఓమ్ని ఆర్కే హాస్పిటల్, అగర్వాల్ ఐ హాస్పిటల్, గాదం డెంటల్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ వి.ఎస్.ఆర్.కె. గణపతి, డిస్కం ప్రెసిడెంట్ బి.గురునాథరావు, డిస్కం మాజీ ప్రెసిడెంట్ జీఆర్ ప్రసాద్, రీజనల్ ప్రెసిడెంట్ ఎ.నూకరాజు, సెక్రటరీ ఎస్.చిరంజీవులు పాల్గొని, కార్మికులతో కలిసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

- గోవింద నామస్మరణతో మార్మోగిన బల్లిగిరి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు



మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అల్లిపురం: ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కనులపండువగా జరిపించారు. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని బల్లిగిరిపై శ్రీదేవి, భూదేవిలతో స్వామి పరిణయ వేడుకను వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ముందుగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అంకురార్పణ, గరుడ పతాకం ధ్వజస్తంభ అధిరోహణం, విశేష హోమాలు జరిపించారు. దేవదాయ శాఖ తరఫున ఆలయ కార్యనిర్వహణాధికారి జి.వి.రమాబాయి పట్టువస్త్రాలు అందజేశారు. సాయంత్రం స్వామివారు, దేవేరుల ఉత్సవ మూర్తులను చూడచక్కగా అలంకరించి, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో జంటలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

కూర్మన్నపాలెం: భావితరాలను అంధకారంలోకి నెట్టే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉక్కు ఉద్యమం మే డే స్ఫూర్తితో మరింత ఉధృతం కానుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 809వ రోజుకు చేరుకున్నాయి, కార్మిక దినోత్సవాన్ని పురస్కరించకుని ఉక్కు ఉద్యమం కోసం కోసం ప్రాణత్యాగాలు చేసిన కార్మికులను స్మరించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.